# సృష్టి దోషం

వసారాలగదిలో సందెచీకటిలో కణతలు నొక్కుకుంటూ మూలుగుతోంది మహాలక్ష్మమ్మ.

"ఏమేవ్! నా గొంతులో ఇన్ని కాఫీనీళ్ళు పోసేదుందా ఈ రోజు?" మరో గదిలాంటి ప్రదేశం నుంచి పక్షవాతంతో మంచాన బడిన భర్త పరంధామిరెడ్డి అరుపులు చీకటిని చీల్చుకుంటూ ఆమెకు వినిపిస్తూనే వున్నాయి. భర్తకు కాఫీ ఇవ్వాలనే వుంది ఆమెకు. కానీ అందులోకి కావల్సిన పంచదార ప్రక్కింటికెళ్ళి అప్పు అడగడానికి, ఆమె ఒకనాటి అభిజాత్యం ఒప్పుకోవడంలేదు.

"అన్నిటికీ వాడు రావాల్సిందే.... వాడు రావాల్సిందే!" గొణుక్కుంటోందామె. "ముక్కుపచ్చలారని ఒకనాటి అల్లారుముద్దు బిడ్డడు, బంగారు ఉగ్గు గిన్నెతో వస తాగిన పసివాడు. ఈనాడు ఈ వెధవ ప్రాణాల కొరకు పడిగాపులు పస్తున్నాడు." ఆమె అంతర్యం, బిడ్డమీద సానుభూతితో ముద్దకట్టుకుపోతోంది. అదే సమయంలో, భర్తమీద అసహాయతతో కూడిన కోపంతో, కుతకుత ఉడికిపోతోంది.

"నేను వెలిగే రోజుల్లో నాదంతా దోచుకతినీ...." గొణుగుతున్నాడతను.

"కన్నూ, మిన్నూ గానక ప్రవర్తించీ...." ఎదురు విసురు విసురుతోందామె.

"పదిరోజులనుండీ కొట్టుకుపోతోంది ప్రాణం. క్వార్టర్ బాటిల్ విస్కీ తెప్పించవే అని బతిమలాడుకుంటున్నాను - నేనేమన్నా సంపాయిస్తున్నానా - ఏమన్నానా అడగ్గానే తెచ్చిపెట్టడానికి ? .... ఉన్నపుడు బాగా తినీ ...." అతను గొణగడం ఆపలేదు. పక్షవాతంతో, పడకలో వున్నా, చుక్కమీద ఆశ అతనిని వదలడంలేదు. ఒక్క రూపాయి దొరికితే ఆపిల్ పండు కొని భర్తకు పెట్టే మహాలక్ష్మమ్మ, ఆ రూపాయికి నాటుసారా కొనిపొయ్యలేక కాదు. కానీ కొన్ని ఏళ్ళ అనుబంధం ఆమె నాపని చేయనీయుడంలేదు.

"నీ పనిట్లా కాదులే, వుండు....వుండు....నీ రహస్యం బయటపెడ్తే...." ఉలిక్కిపడిందామె. ఆమె కతని మాటలు అలవాటయినా, ఉలిక్కిపడడం మాత్రం మానలేదు. కాళ్ళీడ్చుకుంటూ భర్తదగ్గరకొచ్చి, చేతులు జోడిస్తూ అంది ఆమె.

"మీకు నమస్కరిస్తాను, ఆ పనిమాత్రం చేయకండి. నాకున్న ఒకే ఒక్క - సంతోషాన్ని, తృప్తినీ కూలదోయకండి" ఇంతలో ఆమె స్వరం మారిపోయింది.

"ఒకవేళ, అదే జరిగితే, నా శవాన్నే చూస్తారు మీరు."

ఈమారు అతను చలించిపోయాడు.

"కాదులేవే ఏదో అన్నాను" ఆర్థికమైన బాధల్లో కోపంలో, ఒకరిమీద ఒకరు విసుర్లు విసురుకున్నా, ఒకనాటి వాళ్ళ అనుబంధం ఈనాటికీ సురక్షితంగానే వుంది. వాళ్ళిద్దరి మధ్య ఇలాటి సంభాషణలు జరగడం పరిపాటే అయినా, తన తాగుబోతు భర్త, ఏనాడైనా ఈ రహస్యాన్ని బయట పెట్టి, తనకంటూ ఏమీ మిగల్చకుండా చేస్తాడని ఆమెకు మనస్సులో అనుమానంగానే వుంది.

ఆమె మరలా శరీరాన్ని ఈడ్చుకుంటూ వెళ్ళి, లైటు వేసుకోకుండానే పడుకుంది.

"అమ్మా!"

"ఏం నాయనా? ఈ రోజింత ఆలస్యమైంది?"

"నైట్ ట్యుటోరియల్ కాలేజిదాకా వెళ్ళివచ్చానమ్మా. బి. ఏ. కి కట్టడానికి వీలవుతుందేమోనని...."

నిట్టూర్చింది ఆమె. తన బిడ్డ విజ్ఞానకాంక్ష ఆమెకు తెలియంది కాదు.

"అమ్మా! ఎలా వుంది నీకు?"

"బాగానేవుందిరా నువ్వు ముందు వెళ్ళి స్నానం చేసిరా. భోంచేద్దువు గాని" అతను అదేం విన్పించుకోవడం లేదు.

"నేను నీకు సరిగ్గా మందులిప్పించలేకపోతున్నానమ్మా. చూడు ఎలా చిక్కిపోతున్నావో!"

"అలా అనకు కృష్ణా! ఈ రోగిష్టి పేదతల్లికి ఇంత కంటె చేయగలిగింది మరేముంటుంది? నిన్ను కన్న

నాకంటె అదృష్టవంతులు మరెవరుంటారు ?" ఆఖరిమాట అంటున్నపుడు ఆమె పెదాలు వణికాయి.

"నేనే డాక్టరునయ్యుంటే ...." అలా అనేసి నాలి క్కొరచుకొన్నాడు అతను.

"అవును .... అవును .... నువ్వు డాక్టరు అవ్వాల్సిన వాడివి. నీ తండ్రి .... నీ తండ్రి ...."

ఆమె ఆగిపోయింది. రక్తపుపోటు ఎక్కువయింది. శరీరం వణికిపోతోంది. కళ్ళు మసకలు వారిపోతున్నాయి.

"అమ్మా ! నువ్వు పడుకో. ఇప్పుడేమయింది మనకి" ఆదుర్దాగా తల్లిని పొదివి పట్టుకుని పడుకోబెట్టాడతను. ఆమె కళ్ళు మత్తుగా మూతలు పడ్డాయి. గతం ఆ మత్తులో కదలాడింది.

*   *   *

దగ్గర దగ్గర ఇరవై ఏళ్ళనాటి మాట. మహాలక్ష్మమ్మ ఆ యింట మెట్టిన ఏడేళ్ళ తర్వాత గర్భం ధరించింది. లక్షాధికారి పరంధామరెడ్డి ఆనందానికి అంతులేదు. చుట్టాల రాకపోకలకు సందు లేదు. వేవిళ్ళతో సగమయిపోయిన మహాలక్ష్మమ్మను, ఒక అనుమానం పట్టి పీడించసాగింది –

"ఏడేళ్ళ తర్వాత అపురూపంగా వచ్చిన ఈ గర్భం నిలువకపోతే !" భర్త ఆమెను ఊళ్ళో ప్రతి లేడీ డాక్టరు దగ్గర పరీక్ష చేయించినా, వాళ్ళు – గర్భం నిలబెట్టే బాధ్యత తమదని గ్యారంటీ ఇచ్చినా, ఆమె అనుమానం ఆమెను

వదలడంలేదు. తల్లి కావాలనే అమితమైన ఆమె కోర్కె వెనక, అనుమానం అనే బలహీనత ఆమెను పట్టి పీడించ సాగింది. పరంధామరెడ్డిగారు చాల విచారించి, మెంటల్ స్పెషలిస్ట్‌ని కన్సల్ట్ చేశారు. ఆయన స్థలం మార్పు అవసర మని చెప్పటంతో, నాలుగోమాసంలో, తన బిజినెస్ అంతా మూటగట్టి, ఆమెను విశాఖపట్టణం తీసుకెళ్ళారాయన. అక్కడి అందమైన పరిసరాలు, ఆహ్లాదకరమైన వాతావరణం కూడా ఆమెకేమీ సహాయం చేయలేకపోయాయి. శారీర కంగా, మానసికంగా ఆమె దిగజారిపోసాగింది.

ఏడవ నెల ప్రవేశించింది. ఇక భయం లేదనుకుంటుండ గానే, ఒక రాత్రి ఆమెకు నొప్పులు మొదలవడం, వెంటనే హాస్పిటల్‌లో చేర్చడం జరిగిపోయింది. రెండు మూడు గంటలలోనే ఆమెకు సుఖప్రసవం జరిగింది. కానీ ఊపిరి లేనట్టుపుట్టిన ఆ బిడ్డ ప్రాణం ఊపిరి తీసుకోవడానికి ఆయాసపడి ఆగిపోయింది. డాక్టర్ ప్రయత్నాలు ఫలించలేదు. కళ్ళెదుట జరిగిన చేదునిజం ఆమె అనుమానాన్ని బద్దలుకొట్టించి. ఆమె ఏడ్వలేదు. అనుకొన్న దేదో-జరిగినట్టు ఆమె నిర్వీర్యంగా వుండిపోయింది.

భార్యను ఆ స్థితిలో చూచిన ఆయనగుండె నీరయింది. భార్య ఏడ్చి గోల చేయకపోయినా, ఆమె అంతర్యంలో బద్దలయ్యే అగ్నిపర్వతాలు ఆయనకు తెలియనివి కావు. ఆమె - మాతృకాంక్ష అతను ఎరుగనిది కాదు.

అదే క్షణంలో ప్రక్క-బల్లమీద, మధ్య తరగతి స్త్రీ ఒడిలో, ఒక పిల్లాడు ప్రాణం పోసుకున్నాడు. బిడ్డకు

స్నానం చేయించి నర్సు ఆ తల్లికి చూపిస్తుంటే, ప్రక్కకు తిరిగి చూచింది మహాలక్ష్మి.... తల్లిలాగే బొద్దుగా చాలా అందంగా వున్నాడు. అప్పుడే వేలు నోట్లో వేసుకుని చప్పరిస్తున్నాడు.

"వీడు బయలుదేరాడు నన్ను ఉద్ధరించడానికి" ముఖం ప్రక్కకు త్రిప్పుకున్న తల్లిని చూచి ఆశ్చర్యపడింది మహాలక్ష్మి.

"పోనీ నీకంతగా అక్కరలేకపోతే మహాలక్ష్మికి ఇచ్చేయరాదా! ఆమె బిడ్డకోరకు బాధపడ్తున్నారు" నర్సు నవ్వుతూ సరదాగా అన్నది గాని, ఆ తల్లి దగ్గరనుండి ఆ జవాబును మాత్రం ఆశించ లేదామె.

"అంతకంటె యీ పరిస్థితులలో మాకు అందే అదృష్టమేముంటుంది! ఆమె పెద్దమనసు చేసుకుని తీసుకుంటె మా బరువు కొండంత దింపినవాళ్ళవుతారు. వున్న పిల్లలకే సరిగా తిండి పెట్టలేకపోతున్నాం."

మహాలక్ష్మి కళ్ళు ఒక్క క్షణం వెలిగాయి. బల హీనపు బిడ్డప్రాణాలు అనంతవాయువుల్లో కలసిన క్షణాన్నే ఆమె నిర్ణయించుకుంది. 'తనకిక తల్లి అయ్యే ప్రాప్తి లేదు, తల్లిగా గుర్తింపబడితే అంతేచాలు' అని. అలా అనుకున్న ఆమెకు స్వంత వూరికి తిరిగి రాగానే ఆ బిడ్డే సర్వస్వమయిపో యింది. ఆ అందమైన బిడ్డ తన బిడ్డేనని అందరికీ చాటి చెప్పుకుంది. ఈ రహస్యం బయటపడకుండా చాలా కట్టు దిట్టాలు చేసుకుంది. తనకు తొమ్మిదవ నెల రాగానే కాన్పు అయినట్లు విశాఖనుండి చుట్టపక్కాలకు ఉత్తరాలు వ్రాయిం చింది. నాలుగు నెలల బిడ్డను, రెండు నెలల బిడ్డగా అందరికీ

పరిచయం చేసినప్పుడు, ఎవరికైనా అనుమానం వస్తుందేమో నని అందరి కళ్ళల్లోకి పరిశీలనగా చూసింది.

"బిడ్డ ఏపుగా పెరిగాడు" అని ఒకామె అన్నప్పుడు,

"ఎన్ని టానిక్కులు!....ఎన్ని టానిక్కులు!!" అని తేలిగ్గా అబద్ధమాడేసింది.

"మీ ఇద్దరి పోలికలు కాదు. ఎవరి పోలికలు పిన్ని బాబు!" అని అక్క కూతురు అడిగినప్పుడు

"పోదూ! పసిపిల్లలకు పోలిక లేం తెలుస్తాయి!" అని కొట్టిపారేసింది.

* * *

ఆమె ఎన్నో కోరికలతో, ఆ బిడ్డను పెంచుకుని ప్రయోజకుణ్ణి చేయాలని భవిష్యత్తుకు బంగారు సోపానాలు వేస్తున్న సమయంలో - కాలం చేయాల్సిన పని కాలంచేసి చేతులు ముడుచుకుని కూర్చుంది. పరంధామరెడ్డి సరదాకి మొదలెట్టిన తాగుడు అలవాటయి - అతని ఆస్తినంతా హరించివేయడమే కాకుండా లంగ్ టి. బి. ని కూడా ప్రసాదించింది. టి. బి. హాస్పిటల్ నుండి మూడునెలల తర్వాత డిస్చార్జీ అయిన ఆయనకు - ఆస్థి అంటూ కంటికేమీ కన్పించలేదు. పస్తులుండాల్సిన సమయానికి - కొడుకు ఇంటర్ పాసయి అదే వూరిలో ఎదుగూ, బొదుగూ లేని

చిన్న గవర్నమెంట్ ఉద్యోగంలో ఇరుక్కుపోయాడు. తన అల్లారు ముద్దుబిడ్డ బంగారుజీవితం అడ్డం తిరగడంతో మహాలక్ష్మమ్మ రక్తపోటును కొని తెచ్చుకుంది.

"పూవులమ్మిన చోట కట్టెలమ్మలేమురా కృష్ణా! నువ్వు - ట్రాన్స్‌ఫర్‌కు ప్రయత్నించు నాయనా" అని ఆమె బిడ్డను పోరుతూనేవుంది. ట్రాన్స్‌ఫర్ అంటే అంత తేలిగ్గాదని తెలిసిన కృష్ణ 'అలాగే' అంటూ రోజులు గడుపుకొస్తున్నాడు.

ఒకరోజు తన ప్రక్కింటిలో చేరిన ప్రసూనమ్మ చెప్పిన విషయం విని, భయంతో, అనుమానంతో, పశ్చాత్తాపంతో కృంగిపోసాగిందామె. తనకు బిడ్డను ఇచ్చిన దంపతులు- ప్రసూనమ్మ చుట్టాలు. అనాడు తమ అడ్రసు అడగడానికి కూడా ఆసక్తి చూపని దంపతులు ఈరోజు తమ ఉనికి కొఱకు ప్రయత్నిస్తున్నారు. మహాలక్ష్మి ఫలానా అని తెలియని ప్రసూనమ్మ ఉబుసుపోకకు వాళ్ళ తాలూకు విషయాలన్నీ చెప్తూవుంటుంది.

కృష్ణుడి తండ్రి, సమర్థత రూపుదాల్చి. అదృష్టం అందలమెక్కి- భూములు, పుట్రలు కొనుక్కున్నాడు. కొడుకుల్ని ప్రయోజకుల్ని చేశాడు. ఆర్థికంగా కుదుటపడ్డ వాళ్ళకి, తమ ఏడవ కుమారుణ్ణి చూడాలనే కోరిక ప్రబలింది. వాడు కన్పించి అంగీకరిస్తే కడుపులో దాచుకోవడానికి వాళ్ళకేం అభ్యంతరం లేదు. ఇది ఇలా వుండగా, ఇంత అమృతం తన నోట్లో పోయలేదనే అసహనంతో, వృద్ధాప్యం కొని తెచ్చిన స్వార్థంతో, తనని - మానసికంగా ఓదార్చ

వలసిన భర్తే తన రహస్యాన్ని బయటపెడ్తాడనే శంక కూడా ఆమెను పీడిస్తోంది. దీంతో కొన్ని నెలలుగా ఆమెకు మనశ్శాంతి కరువైంది, ఈ రోజది పరాకాష్ట నందుకుంది.

"అమ్మా!"

ఎక్కడో దూరంగా వినిపించినట్లుంది.

"ఈ విషయం నాకెందుకు చెప్పలేదు" అని నిలదీసి అడిగినట్లుంది. ఆమె అనుమానం ఆమెను ఊపిరి సలుపుకోనీకుండా చేసి నిర్వీర్యురాలని చేసింది.

"ఒకవేళ అలా జరిగితే నా శవాన్నే చూస్తారు." అని కొన్ని నిముషాల క్రితం భర్తను బెదిరించిన ఆమె స్వయంగా ఈవిషయం కొడుక్కు చెప్పేయడానికే నిర్ణయించుకుంది. ఈ బలహీనమైన క్షణంలో, చెప్పేయకపోతే, ఆమె గుండె బద్దలయ్యేట్టుంది.

"ఏమైనాసరే నేను చెప్పేస్తాను. అంతగా వాడు తిరస్కరిస్తే, కాదని వెళ్ళిపోతే ఆ రోజే ఈ క్షుద్ర జీవితానికి ఆఖరి రోజవుతుంది." ఆమె బలవంతంగా కళ్ళు తెరిచింది. తన బలహీనమైన చేతిలోకి తన కొడుకు చేతిని తీసుకుంటూ అంది.

"నీకీ రోజు ఒక రహస్యం చెప్తాను కానీ.... కానీ, నాయనా. అది విని నీ తల్లిమీద కోపం తెచ్చుకోకురా."

తన తల్లి తనకు చెప్పబోయే రహస్యమేమిటో?

దానివల్ల ఆమెను తనెందుకు కోపగించుకుంటాడో? అతనికేమీ బోధపడలేదు.

"అమ్మా!"

ఆమె తన బలాన్నంతా కూడదీసుకుని అతిబలవంతాన ఎవరో తరుముకొస్తున్నట్టు గబగబ చెప్పేసింది.

"నువ్వు .... నువ్వు .... నేను కన్నబిడ్డవు కాదురా. విశాఖపట్టణంలో నీ తల్లి ఒడిలోనుంచి వేరుచేసి తెచ్చుకుని ఈ గుండెలమీద పెంచుకున్నవాడివి." అం అని జరిగినదంతా చెప్పేశాక అంతవరకు వున్న మానసిక సంఘర్షణ తగ్గిపోయి, నీరసం ఆమె నరనరాన్ని ఆవహించింది.

వింతగా, వెర్రిగా, నమ్మలేనట్టు అదోలా చూస్తున్న-బిడ్డ కళ్ళల్లోకి చూచిన ఆమె వణికిపోయింది. రక్తపోటు హెచ్చిపోయి, ఆమెకు తెలియకుండానే కళ్ళు మూతలు పడ్డాయి.

"అమ్మా!" ఆమె కళ్ళు తెరవలేకపోతోంది.

"పోనీ, వాళ్ళ అడ్రసయినా మీకు తెలుసా?"

నెమ్మదిగానే వున్నా, స్థిరంగా వున్న కొడుకు స్వరానికి ఆమె బెదిరిపోయింది. "అనుకున్నదంతా అయింది, వాడిప్పుడు తనను కన్న తల్లిదండ్రులను వెతుక్కుంటూ వెళ్తాడు. తనను మమతల బారినుంచి వంచించి మరీ వెళ్ళిపోతాడు." తనచేత ఈ రహస్యాన్ని వెల్లడి చేయించిన ఈ దుష్ట ఘడియను మనసులోనే శపించుకుంటోందామె.

"ఇన్నేళ్ళు నా దగ్గరెందుకు దాచావమ్మా!"

ఇన్ని సంవత్సరాలకు తన బిడ్డ తనని దోషిగా నిలబెట్టి నిలదీసి అడుగుతున్నాడు. ఇప్పుడు తనేం సంజాయిషీ చెప్పగలదు? మాతృవాంఛతో మోసం చేశానని చెప్పాలా? మమకారాన్ని పంచుకోలేకపోయ్యానని చెప్పాలా?

"నన్నింత అప్రయోజకుణ్ణి చేయడానికేనా, నన్ను పెంచుకుంది?"

"నిజమే నాయనా, నువ్వు అంటున్నదంతా నిజమే. కానీ బాబూ! నిన్ను మహారాజును చేయాలనే నిన్ను తెచ్చుకునే రోజు అనుకున్నానురా" ఆమె నోటినుండి మాటలు పెగిలిరావడంలేదు. ఆమె గిలగిలా తన్నుకుంటోంది.

"అమ్మా! అమ్మ" కొడుకు స్పర్శకు ఉలిక్కిపడి కళ్ళు తెరిచిందామె.

అదేమిటి! తన చిన్నారి కొడుకు కళ్ళల్లో అంత దైన్యమేమిటి? అంత మమకారంగా, అపురూపంగా ఎందుకు చూస్తున్నాడు?

"బాబూ!"

"అమ్మా!" ఆమె భుజంమీద వాలిపోయాడు.

"నన్ను....నన్ను విడిచి ఎక్కడికీ వెళ్ళకురా కృష్ణా!"

అతను నవ్వాడు. జాలిగా, ఆప్యాయంగా నవ్వాడు.

"ఎక్కడికి పోతానమ్మా? నేను కళ్ళు తెరిచింది మొదలు నాకు తెలిసిన ప్రపంచం నీ ఒడి మటుకే. నాకింత కంటె చల్లనైన చోటు మరెక్కడుంటుందమ్మా?"

'లేదు నాయనా నువ్విప్పుడు ఈ పేదతల్లిని వదిలేసి వెళ్తే శ్రీమంతురాలైన నీ తల్లి నిన్ను తప్పక ఆదరిస్తుంది" అలా అనేసిన తర్వాత విపరీతంగా మనసులోనే పశ్చాత్తాప పడిందామె—

'నాకు నేనే వీడికి దారిచూపి వాడిని పోగొట్టుకోవడం లేదు కదా!' అని.

"భలే! ఆనాడు నీ దయాదాక్షిణ్యాలమీద నన్ను పారేసి - ఈ రోజు మరలా తీసుకుపోవడానికి, అమ్మా! ఇదేం వస్తువు కాదు కదా!"

తన కొడుకు మాటలతో ఆమెకు కొండెక్కినంత సంబరమయింది. కానీ ఆమె అనుమానం పూర్తిగా తీరలేదు.

"అలా అనకు నాయనా! అప్పుడు వాళ్ళ ఆర్థిక పరిస్థితులు అలాటివి. ఎంత అయినా ఆమె నీ కన్నతల్లి" అతను నవ్వాడు.

"నిజమే కావచ్చు. ఆర్థికమైన బాధలకు తట్టుకోలేక కన్నబిడ్డను కూడా వదలుకున్న ఆ అభాగ్యురాలంటే అందరిలాగే నాకూ సానుభూతి వుంది. అంతే కాని, ఎదురుగా కొత్త వ్యక్తిని నిలబెట్టి 'నిన్ను నవమాసాలు మోసిన తల్లి ఈమె' అని చెప్పగానే, మమకారాలు తెంచుకుని

కన్న అదృష్టానికి ప్రత్యేకత అంటగట్టి, ఆమె వెంట నేను వెళ్ళాలా అమ్మా, నువ్వే చెప్పు ?"

"రక్తసంబంధం...." ఆమె గొణిగింది.

అంతవరకు నవ్వుతున్న అతని పెదాలు ముడుచుకున్నాయి.

"నాకవన్నీ తెలియవమ్మా. రక్తసంబంధమే నిజమైన అనుబంధమైతే, పెద్దలు చెప్పే సృష్టి సిద్ధాంతాలే నిజమైతే మనందరి ఆదిమ సృష్టికి మూలం ఒకే రక్తమయ్యుండాలి. ఆ సృష్టి మూలరక్తం, నీలోను, నాలోనూ వుండితీరాలి" అని ఆగి తల్లి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ పూర్తిచేశాడు. "అందరి రక్తం ఎఱ్ఱగానే వుంటుంది. అలా అని ఆ రక్తంలో ప్రవహించే మమకారాన్ని గుర్తించలేనంత మూర్ఖుడిగా పెంచలేదు మా అమ్మ నన్ను. నీ గర్భంలో పెరిగినంత మాత్రాన నీ గుండెల్లో నాకు స్థానం లేదని నేను అనుకోను. కాదా అమ్మా ?" ఆమె కళ్ళు ఆనందంతో, పరవశంతో విప్పారాయి.

"ఆమె ప్రమేయం లేకుండా ఆమె గర్భంలో పదినెలలు నన్ను పెంచింది. నేను ఒప్పుకుంటాను. కానీ, ఇరవై సంవత్సరాలు నీ దీవెనలతో, నీ మమకారంతో, నీ శరీర కష్టంతో, నీ చల్లని చేతుల్లో పెరిగి ఇంత వాణ్ణయ్యాను. ఇంక నువ్వే నిర్ణయించమ్మా నేనెవరి బిడ్డనో !"

ఆమె అనుమానాలన్నీ ఇన్ని ఏళ్ళకు పటాపంచలయి పోయాయి. కొన్ని ఏళ్ళుగా మర్చిపోయిన ఆనందం ఆమె నరనరంలో చోటు చేసుకుంది. విపరీతమైన సంతోషంతో ఆమెకు మతిపోయింది.

" అయితే, అయితే, ఈ దోషిని అమ్మగా మనసారా నమ్ముతున్నావా కృష్ణా ! "

" ఈనాడు కొత్తగా నమ్మేదేముందమ్మా " అని సన్నగా నవ్వుతూ స్థిరంగా అన్నాడు....

"నువ్వు దోషివెందుకవుతావమ్మా! నన్ను నీ కడుపున పడేయబోయి, పొరపాటున ఆమె గర్భంలోకి విసిరేశాడు సృష్టికర్త. ఇది....సృష్టిదోషం. అంతే.... ! "